దట్టంగా పొగమంచు



ఎల్.ఎన్.పేట: ఉదయం 7 గంటల సమయంలో తురపేట జంక్షన్ వద్ద లైట్లు వేసుకుని వాహనాల రాకపోకలు



మెళియాపుట్టి: పొగమంచుతో దెబ్బతిన్న మామిడి పూత



ఆమదాలవలస రూరల్: ఉదయం 8 గంటల సమయంలో పురుషోత్తపురం రహదారిలో కురుస్తున్న మంచు

గతకొద్ది రోజుల నుంచి తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కురవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందిపడ్డారు. తెనే మంచుతో అపరాలు, మామిడి, జీడి పంటలు దెబ్బతింటున్నాయి. బుధవారం ఉదయం 9 గంటల వరకు మంచు అధికంగా కురిసింది. మధ్యాహ్నం ఎండ వేడి ఎక్కువగా ఉంది. పొగమంచుకు చిన్నారులు, వృద్ధులు దూరంగా ఉంచాలని వైద్యులు సూచిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి



ప్రచారం చేస్తున్న సువ్వారి గాంధీ

నరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ కోరారు. మండలంలోని మతలబుపేట, చినమతలబుపేట, తెలికిపెంట, చినకాగితాపల్లి, యరగాం, కె.జె.పేట గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు సువ్వారి సత్యనారాయణ, నాయకులు పేడాడ వైకుంతరావు, ఇల్లాకులు శ్రీనివాసరావు, బగాది ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన



సస్యరక్షణ కోసం రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

నరుబుజ్జిలి: వరినారు చిగుర్లు తుంచడం వల్ల కాండం తొలుచు పురుగు నివారణ సాధ్యపడుతుందని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండలంలోని రొట్టవలస గ్రామంలో ఆలస్యంగా వేస్తున్న వరినాట్లు పొలాలను బుధవారం పరిశీలించారు. ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల తెగుళ్ల ఆశించే ప్రమాదముందన్నారు. విద్యార్థులు సూర్యనారాయణ, ధనరాజు, అహమ్మద్, సుధాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి



పురుషోత్తపురంలో ప్రచారం చేస్తున్న చింతాడ రవికుమార్

నరుబుజ్జిలి: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గుర్తించి ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ రవికుమార్ కోరారు. పార్టీ మద్దతుపై ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ తరపున మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో బుధవారం ప్రచారం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు చేయలేని అభివృద్ధిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అతి తక్కువ కాలంలో చేసిచూపించారని గుర్తుచేశారు. పార్టీ కార్యకర్తలు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరుబుజ్జిలి: ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంధించిన పోలింగ్ కేంద్రాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రంలో వసతులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు గురించి తహసీల్దార్ బమ్మిడి రమేష్‌కుమార్, ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాదు పరిశీలించారు. ఎన్నికలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సందడే.. సందడి



సినీ గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్ పార్టీ సందడిగా జరిగింది. తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం హర్షవర్ధన్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా ఉండాలని, బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో పాసై స్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద, సినీ గీతాలకు నృత్యాలు చేసి సందడి చేశారు. 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థులు పోటాపోటీగా డాన్స్‌లు చేశారు.

అధికారుల పనితీరుపై ధ్వజం

- విద్యుత్, గృహనిర్మాణ శాఖలపై సభ్యుల అసంతృప్తి



సమస్యలపై ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

ఎల్.ఎన్.పేట: విద్యుత్, గృహనిర్మాణ శాఖల అధికారుల పనితీరుపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చింతలబడవంజ, డొంకలబడవంజ గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై ఆ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని సర్పంచ్ ఊట లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలో అన్ని మండలాల్లోనూ పేదలకు జగనన్న కాలనీ ఇళ్లు వచ్చాయని, పాతపట్నం నియోజకవర్గంలోని మిగిలిన మండలాలతో పాటు ఎల్.ఎన్.పేట మండలానికి మాత్రం నాలుగేళ్ల పాలనలో ఒక్క కాలనీ ఇళ్లు కూడా మంజూరు కాలేదని యంబరాం సర్పంచ్ వెలమల గోవిందరావు సభదృష్టికి తీసుకువచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనా గృహనిర్మాణం పథకంలో కాలనీ ఇళ్ల మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఏఈ కె రమేష్ తెలిపారు. పలు శాఖల అధికారులు గైర్హాజరు కావటంతో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు పనుల్లేక సమావేశానికి వస్తున్నామా? అని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్‌ను నిలదీశారు. మహిళా ప్రజాప్రతినిధులకు బదులుగా వారి ప్రతినిధులు సభలోకి వచ్చినప్పటికీ ఎంపీడీఓ వద్దని చెప్పకపోవటంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

- మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ నాయక్



మొక్కలు నాటుతున్న మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్

సారవకోట: ప్రతీ గ్రానైట్ లీజుదారుడు క్వారీలకు సమీప గ్రామాల్లో మొక్కలు నాటాలని మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని గోవర్ధనపురం రెవెన్యూ పరిధిలో అవనీర్ గ్రానైట్ క్వారీ ఎం.డి దొడ్డా మహేశ్ ఆధ్వర్యంలో పెద్దగుజ్జువాడ నుంచి చిన్న గుజ్జువాడ వరకు 1.7 కిలో మీటర్ల పరిధిలో గల రోడ్డుకు ఇరువైపులా కొబ్బరి, బాదాం, కాము మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రానైట్ క్వారీల నుంచి వచ్చే ధూళి, కాలుష్యం నుంచి రక్షణకు మొక్కలను విరివిగా నాటాలన్నారు. మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ ఫణిభూషణరెడ్డి, సర్పంచ్‌లు కొండాల బాబూరావు, గౌంటి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ గొర్లె ఢిల్లీరావు, నేచర్ సేఫ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్.రంజిత్ కుమార్, అధ్యక్షుడు తంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొల్లివలసలో బీజేపీ కార్యాలయం ప్రారంభం



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సోము వీర్రాజు

నరుబుజ్జిలి: బూర్జ మండలంలోని కొల్లివలసలో బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పర్యటించారు. గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ తరపున పోటీచేస్తున్న పీవీ మాధవ్‌ను గెలిపించాలని గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరి, పైడి వేణుగోపాలం, జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు పిల్ల జగన్నాథం పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

నరసన్నపేట: ఉత్తరాంధ్ర అభివృద్ధికి బీజేపీ గత 9 ఏళ్లగా ఎంతో కృషి చేస్తుందని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతుగా నివాలని పీవీఎన్ మాధవ్ కోరారు. నరసన్నపేటలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇందిరా నగర్‌లోని ఓ స్కూల్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ పార్టీ నాయకులు సంపతిరావు తేజేశ్వరరావు, బి.రాంబాబు, న్యాయవాది రాజకుమార్ , విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



ఎల్.ఎన్.పేట: మీనామృతం తయారీపై అవగాహన కలిగిస్తున్న పద్మావతి

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు కలుగుతుందని, తక్కువ పెట్టుబడితో రైతులే తయారు చేసుకునే మీనామృతాన్ని మొక్కలకు వేస్తే పెరుగుదల ఉంటుందదని ప్రకృతి వ్యవసాయం మండల ఎస్ఎఫ్ మెట్ట పద్మావతి అన్నారు. మండలంలోని యంబరాం గ్రామంలో బుధవారం మీనామృతం తయారీపై రైతులకు అవగాహన కలిగించారు. మూడు కిలోల చేపల వ్యర్థాలు, మూడు కిలోల బెల్లాన్ని మూడు లీటర్ల నీటిలో కలిపి మీనామృతం తయారు చేసుకోవచ్చన్నారు. ఐసీఆర్పీ పవన్ ఉన్నారు.

గులిరాగి పద్ధతులపై అవగాహన

హిరమండలం: అంతర్జాతీయ చిరుదాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని సీది గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం పి.రేవతి, కొత్తూరు వ్యవశాయశాఖ ఉప సంచాలకులు రాజగోపాలరావు గులిరాగి పద్ధతులపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఎం.అలివేలు మంగ మహిళా రైతు పొలంలో సాగు చేస్తున్న చిరుధాన్యాల సాగును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి పొందేందుకు అనసరించాల్సిన పద్ధతులను వివరించారు. గులిరాగు పద్ధతులపై రైతు సాధించిన విజయగాథను వీడియోగా చిత్రీకరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

పాతపట్నం: మండలంలోని పలు పంచాయతీల్లో ఐదు వార్డు మెంబర్లకు పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి పోలింగ్ నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. సరాలి పంచాయతీలో 2, 4 వార్డులకు, గురండి పంచాయతీలో 8వ వార్డు, ఎ.ఎస్.కవిటి పంచాయతీలో 10వ వార్డు, చాకిపల్లి పంచాయతీలో 3వ వార్డుకు పోలింగ్ జరగనుంది. ఆయా పంచాయతీ కార్యాలయాల్లోనూ, గ్రామ సచివాలయాల్లోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఓటర్ల జాబితాను ఉంచినట్లు ఈఓపీఆర్డీ ఎన్.ప్రసాద్ పండా ఆదివారం తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు అధికారులను నియమించామన్నారు.

పాఠశాల తనిఖీ

హిరమండలం: మండలంలోని సుభలయ ఆర్ అండ్‌ఆర్ కాలనీలో గల ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ కె.రాంబాబు బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన సమ్మెటీవ్, ఫార్మెటీవ్ పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల గ్రేడింగ్ రికార్డులు పరిశీలించారు.

రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ మృతి



భానుప్రకాష్‌రెడ్డి (ఫైల్)

మెళియాపుట్టి: మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కప్ప భానుప్రకాష్‌రెడ్డి (48) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. డైరెక్టర్‌గా రెండేళ్లుగా బాధ్యతలు నిర్వహించారు. మరలా రాష్ట్ర ప్రభుత్వం పదవీకాలాన్ని గత నెల 22న మరో రెండేళ్లు పొడిగించింది. గతకొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాల్లో పలు భజనల్లో ఈయన ఏర్పాటు చేసిన వేణుగోపాల భజన బృందం ప్రదర్శనలు చేసేంది. మెళియా పుట్టిలో జరిగే డోలో యాత్రలో అనేక పౌరాణిక, జానపద కార్యక్రమాల నిర్వహించడానికి కృషిచేసేవారు. మరో వారం రోజుల్లో డోలోత్సవాలు ప్రారంభంకానున్న సమయంలో ఈయన మృతి గ్రామస్తులను కలచివేసింది. ఈయనకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సత్కారం..



జానికిరాజు, అల్లు రాములుకు సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన పురాణ కర్తలు వైశ్యరాజు జానికిరాజు, అల్లు రాములుకు కొత్తూరు గ్రామ ప్రజల తరపున సంతకవిటి గ్రామానికి చెందిన ప్రముఖ ప్రవచనకర్త యాలల శ్రీనివాసరావు బుధవారం సత్కరించారు. కొత్తూరులో అభయాంజనేయ ఆలయం వద్ద భగవద్గీత పారాయణం బుధవారంతో ముగియడంతో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



ఆమదాలవలస రూరల్: లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లలితకుమారి



ఎల్.ఎన్.పేట: పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌందర్య

ఆమదాలవలస రూరల్: మండలంలో చిన్నజొన్నవలస గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారు రెడ్డి లక్ష్మికి వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు పింఛన్ అందించాలనే ఉద్దేశంతో జొన్నవలస గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ అంబటి లలితకుమారి బుధవారం ఆస్పత్రికి వెళ్లి వితంతు పింఛన్ పంపిణీ చేశారు.

కిమ్స్‌కు వెళ్లి..

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన అప్పలనర్సమ్మ అనారోగ్యంతో గత కొద్ది రోజులుగా కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు ప్రభుత్వం నుంచి ప్రతీనెలా వైఎస్సార్ భరోసా వృద్ధాప్య పింఛన్ వస్తుంది. గ్రామ వలంటీర్ లంక సౌందర్య బుధవారం ఆస్పత్రికి వెళ్లి అప్పలనర్సమ్మకు పింఛన్ అందజేసింది.

ముగిసిన ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు



పాతపట్నం: గురండిలో ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు: పూజలు అందుకుంటున్న ఎల్లమ్మతల్లి

పాతపట్నం: మండలంలోని గురండి గ్రామంలో ఉన్న ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం రాత్రి ఎమ్మెల్యే రెడ్డి ఎల్లమ్మ తల్లిని దర్శించుని పూజలు చేశారు. గత మూడు రోజుల నుంచి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అరటి గెలలతో ఆలయాన్ని అలంకించారు. మహిళలు ముర్రాటాలతో మొక్కులను చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎనుగుతల సూర్యం, సర్పంచ్ తులసీనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా జామి జాతర

పాతపట్నం మండలంలోని కొరసవాడ గ్రామంలో గల ఎల్లమ్మ తల్లి ఆలయంలో జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి భక్తులు జోగి దండి, అమ్మవారికి ప్రీతికరమైన వంటలను పెట్టి పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు, పోలీసులు, సర్పంచ్ ఉమ, ఎంపీటీసీ సుగుణ చర్యలు తీసుకున్నారు.

పోతన్న, ఎల్లమాంబలకు పూజలు

కొత్తూరు: నివగాంలో బుధవారం ప్రారంభమైన జామి యాత్రలో పోతన్న, ఎల్లమాంబకు భక్తులు విశేష పూజలు చేశారు. ఇంటింటా జోగి దండిన బియ్యాన్ని ఎల్లమాంబకు సమర్పించారు. ఐదు రోజల పాటు యాత్ర నిర్వహించనున్నారు. పలు ఆధ్యాత్మిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



నవగ్రహాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ఆధాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గార్లపాడు (తాయిమాంబాపురం) ఆర్ఆర్ కాలనీలో గల ఉమా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం జరిగిన నవగ్రహాల ప్రతిష్ఠలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించటం వల్ల గ్రామస్తుల మధ్య ఐకమత్యం పెరుగుతుందన్నారు. గ్రామంలో శాంతి నెలకొంటుందన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, గార్లపాడు సర్పంచ్ తొత్తడి మురళీకృష్ణ, గేదెల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పొందూరు: స్థానిక భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు వినికిడి యంత్రం, వీల్‌చైర్‌లను ఎంఈఓ పీవీ రామరాజు బుధవారం పంపిణీ చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొన్న నాగహర్షవర్ధన్‌కు ఆర్పీ ఫౌండేషన్ వారు స్పోర్ట్స్ డ్రెస్, హియరింగ్ ఇంపేయర్డ్ మిషన్‌ను అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ భార్గవ్, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి చల్లదనం..



కలశాలతో జడ్డమ్మ తల్లి ఆలయానికి చేరుకున్న మహిళలు

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామంలో ఉన్న గ్రామ దేవత జడ్డమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సురేష్ పండా, వేద పండితులతో హోమాలు, పూజలు నిర్వహించినట్లు సర్పంచ్ బిజిలి పుల్లాయ్ తెలిపారు. మూడు రోజులపాటు ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు, సాంస్కృతిక కార్యాక్రమాలు, ప్రతి రోజు మధ్యాహ్నం అన్నప్రసాదం నిర్వహించామన్నారు. మొదటి రోజు గ్రామంలోని మహిళలకు కలశాలతో అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా చేరుకుని చల్లదనం చేశారు. భక్తులు మొక్కులు చెల్లించారు. బూరగాంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.